
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసు కవాతును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ



పంద్రాగస్టు ఏర్పాట్లు పూర్తి

- అట్టహాసంగా స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధం
- జెండా పండుగకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు
- జెండా ఆవిష్కరణకు విద్యుత్ శాఖ మంత్రి రవి



నాడు ఉద్యమ కారులు నల్లూరు లో నిర్మించిన గాంధీ స్థూపం



పేటేరులో స్వాతంత్ర్య సమరయోధుల గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

బాపట్ల/ బాపట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు బాపట్లలోని పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. జాతీయ జెండాల రెపరెపలతో ప్రాంగణం ముస్తాబైంది. విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరుగుతున్న తొలి జెండా పండుగ కావడంతో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హాజరు కానున్నారు. ఆయనే జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే స్టాల్స్‌కు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ వెంకటమురళి ఆయా శాఖల అధికారుల కు పలు సూచనలు చేశారు. శాఖల వారీగా ఏర్పాటు చేసే శకటాలపై కూడా బుధవారం మరోమారు అధికారులతో సమావేశమైన ఏర్పాట్ల సన్నద్ధతపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీస్ సహా అన్ని శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికా రులకు ప్రశంసాపత్రాలను అందించనున్నారు.



పేటేరులో గాంధీజీ బస చేసిన భవనం

పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్స్

పంద్రాగస్టు కవాతు మరింత సుందరంగా నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడీ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు పేరెడ్‌గ్రౌండ్‌లో బుధవారం పరేడ్ రిహార్సల్స్ జరిగాయి. జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి రిహార్సల్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ తుషార్ డూడీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీసు కవాతు రిహార్సల్ నిర్వహించారు. వేడుకలు వీక్షించడానికి విచ్చేసే ప్రజలకు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినభద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ టిపి.విఠలేశ్వర్, ఆర్‌ఐలు డి.శ్రీనివాసరెడ్డి, షేక్.మౌలుద్దీన్ పాల్గొన్నారు.

జిల్లాలో మహాత్ముడి గుర్తులు

రేపల్లె: స్వాతంత్ర్య దినోత్సవానికి పల్లె పట్టణం సిద్ధమవుతుండగా.. జిల్లాలో స్వాతంత్ర్య పోరాటాలు, మహాత్మాగాంధీ పర్యటనలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. స్వాతం త్ర్య పోరాటంలో ప్రజలను చైతన్యవంతం చేసే క్రమంలో నాడు మహాత్ముడు దేశవ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో జిల్లాలోని చెరుకుపల్లి మండలం కావూరులో 1933లో గాంధీ గ్రామస్తులను ప్రత్యేకంగా కలిశారు. గ్రామానికి చెందిన తుమ్మల బసవయ్య, దుర్గాంబ దంపతులు మహాత్మాగాంధీ స్ఫూర్తితో 50 ఎకరాలను వినయాశ్రమం స్థాపనకు అందజేశారు. ఆ సమయంలో వినయాశ్రమంలో అశ్వద్ధ వృక్షాన్ని నాటారు. మహానీయులు నడియాడిన వినయాశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసి యువతకు స్ఫూర్తి నింపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- స్వాతంత్ర్య ఉద్యమాలకు ఊపిరిలూదిన రేపల్లె మండలం నల్లూరులో గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా నల్లూరువాసులు వంటిపై ఉన్న అభరణాలు మహాత్ముడికి విరాళంగా అందించారు. తెనాలికి చెందిన వెంకటప్పయ్య నల్లూరు గ్రామం కేంద్రంగా హిందీతోపాటు ఉద్యమ పాఠాలు నిర్వహించారు. 1934 జనవరి 18న గాంధీ స్తూపం నిర్మించారు. అది నాటి త్యాగాలకు జ్ఞాపక చిహ్నంగా నిలిచింది.
- రేపల్లె మండలం పేటేరులో 1943లో ఆంధ్ర రత్న గోపాలకృష్ణయ్య గ్రంథాలయంలో గాంధీ బసచేసి ఉద్యమకారులను చైతన్యపరిచారు.గాంధీజీ నడయాడిన ప్రాంతంలో గుర్తుగా 1955లో గాంధీ విగ్రహాన్ని అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు నిర్మించారు.



కావూరు వినయాశ్రమంలో గాంధీ కుటీరం వద్ద 1933న అశ్వద్ధమొక్క నాటుతున్న మహాత్మాగాంధీ



ప్రస్తుతం కావూరు వినయాశ్రమంలో అశ్వద్ధ వృక్షం

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి పంపిన లేఖను, జాతీయ జెండాను మంగళగిరి సబ్ డివిజన్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్ రాధాకృష్ణమూర్తి బుధవారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. గుంటూరులో జరిగే స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన నున్న లోకేశ్‌కు మంగళగిరి తహసీల్దారు ఆహ్వాన పత్రిక ను అందజేశారు. - తాడేపల్లి టౌన్





విద్యుత్ కాంతుల్లో సచివాలయం

తుళ్లూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాల తో అలంకరించారు. జాతీయ జెండా రంగుల విద్యుత్ దీపాల వెలుగు ల్లో బుధవారం రాత్రి సచివాలయం, అసెంబ్లీ భవనాలు కాంతులీనాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయా భవనాలను పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సచివాలయం ముస్తాబు చేశారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో సచివాలయ భవనాలు నూతన శోభను సంతరించుకున్నా యని రాజధాని వాసులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ వెలుగుల్లో మంగళగిరిలోని ఎయిమ్స్

ఆక్టోపస్ ఏఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్



తాడేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుని కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఆక్టోపస్ ఏఎస్పీ కే రామచంద్ర మూర్తిని ఎంపిక చేసింది. 2020 నుంచి వడ్డేశ్వరంలోని ఆక్టోపస్‌లో కార్యాలయంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. 1991లో ఆర్‌ఎస్‌ఐగా విధుల్లో చేరి 2009లో అసిస్టెంట్ కమాండెంట్‌గా 2020లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు. గతంలో డిచ్‌పల్లి 7వ పటాలం, కొండాపూర్ 8వ పటాలం కాకినాడ 3వ పటాలం, మంగళగిరి 6వ పటాలంలో వివిధ హోదాల్లో ఆయన సేవలు అందించారు. 2004 నుంచి 2007 వరకు గ్రే హౌండ్స్, 2017 నుంచి 2020 వరకు స్టేట్ ఆర్మ్ ఇన్‌స్పెక్షన్ అథారిటీలో అత్యుత్తమ సేవలు అందించారు. 2012లో రామచంద్రమూర్తి సేవలకు గుర్తింపుగా ఏపీ పోలీస్ సేవా సంఘం సర్వీసులో 8 క్యాష్ రివార్డులు, 38 గుడ్ సర్వీస్ ఎంట్రీ, 25 అప్రి యేషన్స్, 28 కమెంటేషన్స్, గోదావరి కృష్ణా పుష్క రాలలో 3 ప్రశం సాపత్రాలు పొందారు. రామచంద్ర మూర్తికి ప్రతిష్ఠాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించడంపై పోలీసు, ఆక్టోపస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కుడి కాల్వకు నీటి సరఫరా కొనసాగింపు

1 నుంచి జోన్ - 2 ఆయకట్టుకు సాగు నీరు

నరసరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాల్వ ఆయకట్టుకు నీటి సరఫరాపై జలవనరుల శాఖ స్పష్టత ఇచ్చింది. జోన్-1 ఆయకట్టుకు నీటి సరఫరాను కొనసాగిస్తున్నారు. ఈ ఆయకట్టు పరిధిలో రైతులు వరి సాగు చేసుకోవచ్చని వెల్లడించింది. పమిడిపాడు బ్రాంచి కెనాల్ మినహా జోన్-1లోని పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని ఆయకట్టు అంతటకి సాగు నీటి సరఫరా కొనసాగుతోంది. ఒకటో తేదీ నుంచి జోన్-2 ఆయకట్టులోని ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో సాగు నీటిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు రవి బుధవారం తెలిపారు. వరి, పత్తి, మిరప తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా పంటలకు వినియో గించుకోవాలని తెలిపారు.

సాగర్‌లో పూర్తి స్థాయికి నీరు

నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 7,528 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యాంలో నీటిమట్టం పూర్తి స్థాయికి అంటే 590 అడుగులకు చేరింది. 312.05 టీఎంసీలకు జలాశయంలో 312 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో డ్యాం క్రస్ట్ గేట్ల మళ్లీ తెరుచుకున్నాయి. బుధవారం డ్యాం రెండు గేట్లను తెరచి దిగువకు 16,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం ఇన్‌ఫ్లో 63,123 క్యూసెక్కులు కాగా ఆదే స్థాయిలో నీటి విడుదల జరుగుతోంది. బుగ్గవాగు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 2.83 టీఎంసీలకు 0.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. బుగ్గవాగు నుంచి కుడి కాల్వకు 5,095 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ పరిధిలో ముమ్మరంగా వరి నారు మళ్ల సాగు పనులు జరుగుతున్నాయి. మరో వైపు పత్తి, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు.



బుగ్గవాగు నుంచి నీటి సరఫరా

గంజాయి విక్రేతల అరెస్టు

● 1.3 కేజీలు స్వాధీనం ● సీఐ రమేష్‌బాబు వెల్లడి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 14: పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తును అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని సుల్తానాబాద్ కుమార్ పంపుల కాలనీ రైల్వే కరెంటు సబ్ స్టేషన్‌కి వెళ్లే రోడ్డులోని ఖాళీ స్థలం సమీపంలోని చెట్ల వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంమేరకు ఏఎస్ఐ బీ.రమేష్‌బాబు తన సిబ్బందితో దాడి చేశారు. ముక్కామల సంజయ్, కటికల సాయికుమార్, చిక్కాల గిడియాస్, మల్లెల వెంకట సుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ రెహమాన్‌లను అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారు. విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈ ముఠా 1.5 కేజీల గంజాయిని రూ.18 వేలకు కొనుగోలు చేసి, తెనాలికి తీసుకు వచ్చి చిన్నచిన్న ప్యాకెట్‌లుగా విక్రయిస్తున్నారు. వీరివద్ద నుంచి 1.3 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. నిందుతులను చాకచక్యంతో పట్టుకున్న ఏఎస్ఐ రమేష్‌బాబు, పీసీలు పీ.మురళి, డీ.సురేష్, జీ.సురేంద్రలను త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు అభినందించారు.

బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, ఆగస్టు 14 : బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఏపీలో అనంతరామన్ కమిషన్ సిఫారసు మేరకు తొలిసారిగా 25 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, అనంతరం మురళీధర్ కమిషన్ సిఫారసు మేరకు 44 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఎన్టీఆర్ జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్శిటీలు, ఎయిడెడ్ సంస్థలు, కార్పొరేషన్లలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు జరిపిన సర్వేలో లక్ష వరకు బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని వీటన్నింటిని భర్తీ చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేయాలన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 14 : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వవున్నట్లు ప్రాజెక్టు అధికారి ఏఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 23,646 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుండగా, దిగువకు 23,646 క్యూసెక్కులు విడుదలచేస్తున్నామని, వీటిలో 12,400 క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతుందన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

● అధికారులకు మంత్రి నారా లోకేశ్ సూచనలు
● 26వ రోజు ప్రజాదర్బార్‌కు విజ్ఞప్తుల వెల్లువ



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

తాడేపల్లిటౌన్, ఆగస్టు 14: మంత్రి లోకేశ్ పలకరింపులోనే తమ సమస్యలు సగం పరిష్కారం అయినంత భరోసా అనిపి స్తుందని ప్రజాదర్బార్‌కు వచ్చిన అర్జీదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌కు 26వ రోజు బుధవారం విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. వచ్చే విన్నపాలను సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.

వైసీపీ ప్రభుత్వ అండతో తన 25 ఎకరాల భూమిని కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన సారిపాక నరసమాంబ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. తిరుమలలో నిర్వాసితులైన వారికి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు హాకర్ లైసెన్సులు, షాపులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సుద్దల రాజుయాదవ్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి కారణంగా డిప్లమో సర్టిఫికెట్లు నూజివీడు పాలిటెక్నిక్ కాలేజీలోనే ఉండిపోయాయని, ఉన్నత చదువుల కోసం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరుకు చెందిన చిల్లపల్లి జగదీష్ విజ్ఞప్తి చేశారు. కాజ గ్రామంలోని తన 20 సెంట్ల వ్యవయసాయ భూమిని అడంగల్, 1బీలో నమోదు చేయాలని మోదుగుల శేషబాబు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన వీ.విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

కృష్ణాజిల్లా గుడివాడలోని డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీలో పీజీ అడ్మిన్లు కల్పనకు చర్యలు తీసుకోవాలని కళాశాలకు చెందిన గ్రాడ్యుయేట్ విద్యార్థులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.



బాధితుల సమస్యలను ఆలకిస్తున్న మంత్రి నారా లోకేశ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో రేపల్లెలో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి తమ పేర్లతో అక్రమ రుణాలు పొందిన ఆర్పీ షేక్ ముంతాజ్, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 లక్షల మంది టూవీలర్స్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలని ఏపి టూవీలర్స్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరారు. కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరుతో పాటు టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన తనకు జన్మదిన తేదీ తప్పుగా నమోదుచేసిన కారణంగా వెటర్నరీ కౌన్సిలింగ్‌లో అర్హత సాధించలేకపోయాయని, తన సమస్యను పరిష్కరించాలని రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లికి చెందిన జీజయనాగ మల్లీశ్వరి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తనకు వైద్యసాయం అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన గంజి రామకృష్ణ కోరారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా సీఎస్ పురంకు చెందిన దేవండ్ల తిరుపతయ్య మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎలాంటి ఆధారం లేని తనకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తిరుపతికి చెందిన 74 ఏళ్ల జి వైదర్భి అనే వృద్ధురాలు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా ఉరుకుంద శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పని చేస్తున్న తనను వైసీపీ ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించిందని తిరిగి పునరుద్ధరించాలని ఉరుకుందకు చెందిన ఆర్ నర్సింహులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థలో (సీఆర్‌డిఏ) పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్, ఫెసిలిటేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య దేశంలో మహిళలకు రక్షణ కరవు

● మంగళగిరి ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు
● వైద్య విద్యార్థినిపై అత్యాచార ఘటనను ఖండిస్తూ నిరసన
● వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్

మంగళగిరి, ఆగస్టు 14: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న మన దేశంలో ఈనాటికి మహిళలకు రక్షణ కరవైందని మంగళగిరి ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కలకత్తా ఆర్జికర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ స్థానిక ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎయిమ్స్ వైద్య కళాశాల నుంచి విద్యార్థులు 'వుయ్ వాంట్ జస్టిస్' ప్లకార్డులు చేతబూని మెయిన్‌గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ విశ్రాంతి కోసం వెళ్లిన వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడడం, అది కూడ కళాశాల ఆవరణలోనే ఈ ఘాతుకానికి పాల్పడడం స్వతంత్ర్య దేశానికే అవమానమని అన్నారు. కలకత్తా ఆర్జికర్ కళాశాలలో జరిగిన ఈ దారుణానికి బెంగాల్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. వైద్యుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. తమ ఈ డిమాండ్లను నెరవేర్చేవరకు తమ ఈ నిరసనను కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు.



మంగళగిరి ఎయిమ్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యవిద్యార్థులు



సంతాప సభలో పాల్గొన్న ఐఎంఏ వైద్యులు

వైద్యులపై దాడులు అరికట్టేందుకు కఠిన చట్టాలు తేవాలి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ డిమాండ్

గుంటూరు(మెడికల్): వైద్యులపై దాడులు అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినచట్టాలు చేసి అమలు పర్చాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌కోరారు. మంగళవారం రాత్రి కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్లో నిర్వహించిన ట్రైనీ పీజీ డాక్టర్ మౌమిత దేబాంత్ సంతాప సభ, క్యాండిల్ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. సభకు ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని డాక్టర్ నందకిషోర్ ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమై చట్టాలు అమలు పర్చా లని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడు వెలగా మహేష్, బాలినేని సాయికృష్ణ, కే.రామలింగేశ్వర రావు, వీఆర్ తారక్‌నాథ్, సీహెచ్ విశ్వేశ్వరరావు, బీబీ.అప్పారావు, టీ.సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 14: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు బుధవారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7528 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16200, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 63,123 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 63,123 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లకు జాతీయ జెండా రంగులతో లైట్లను అమర్చారు.

స్నాక్స్ పంపిణీ విధులు వివాదాస్పదం

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం గుంటూరు జిల్లాలో పలువురు గ్రామ సచివాలయాల ఉద్యోగులకు కేటాయించిన విధులు వివాదాస్పదమయ్యాయి. సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి డీ.మధుసూదనరావు 50 మంది ఉద్యోగులకు వేడుకలు జరిగే పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో స్నాక్స్ పంపిణీ బాధ్యతలు కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ జారీచేశారు. ప్రత్తిపాడు, తాడికొండ, పొన్నూరు నియోజకవర్గాల్లోని పలు మండలాలకు చెందిన వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు ఈ విధులు వేశారు. బుధవారం ఉదయం ఆయా ఉద్యోగులకు ఈసమాచారాన్ని తెలిపారు. దీనిపై వారు తీవ్ర అసంతృప్తికి గురై అసోసియేషన్ నాయకుల ద్వారా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో సాంఘిక సంక్షేమ అధికారి మధుసూదనరావు తాను జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ని ఉపసంహరించుకొన్నారు.



నరసింహారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

మాచర్లటౌన్, ఆగస్టు 14: పట్టణంలోని 22వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బత్తుల నరసింహారావు టీడీపీలో చేరారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువా కప్పి నరసింహారావును సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యర్రాకుల సిద్ధయ్య, షేక్ సుభాని, గట్ల కోటిరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ముస్తఫా, చంద్రం పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో బదిలీ ?

● మత్స్య శాఖకు వెళ్లనున్న వసంతరాయుడు

గుంటూరు సిటీ, ఆగస్టు 14 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వసంతరాయుడు బదిలీకి రంగం సిద్ధమైంది. రేపో మాపో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలకు ముందు జరిగిన బదిలీలలో అమలాపురం ఆర్డీవోగా ఉన్న వసంతరాయుడుని గుంటూరు సీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఎన్నికలు ముగియటంతో మళ్ళీ మాత్యశాఖకు వెళ్లేందుకు సీఈవో ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కూడా రెవెన్యూ శాఖ నుండి వచ్చిన వారిని తిరిగి అదే శాఖకు పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వసంతరాయుడు బదిలీ ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది.

విజ్ఞాన్‌తో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు స్వీకరిస్తున్న డాక్టర్ లావురత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య),ఆగస్టు14: ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయలోని ఇంగ్లీషు అసెస్‌మెంట్ విభాగం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంతో లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీషు లాంగ్వేజ్ కార్యక్రమంపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వీసీ ఆచార్య పీ.నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంబ్రిడ్జి వర్సిటీ సౌత్ ఏసియా రిజనల్ డైరెక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తిసుబ్రమణియన్ తదితరులతో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అవగాహన పత్రాలు మార్చుకున్నారు. తొలిసారి విజ్ఞాన్‌లోనే ఈ ప్రోగ్రామ్ ప్రవేశ పెడుతున్నట్లు కేంబ్రిడ్జి ప్రతినిధులు వెల్లడించారు. విజ్ఞాన్ వర్సిటీలో కేంబ్రిడ్జి సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులతో అనుసంధానం కానున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

● రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఆగస్టు 14: తీరప్రాంతంలోని నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, వారందరినీ స్మరించుకోవాల్సిన బాధ్యత నేడు మనందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటిపైన జాతీయ పతాకం ఎగరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్ గర్ తిరంగ నినాదాన్ని ఇచ్చారని, అందరూ ఆచరించాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతిఒక్కరిలోనూ నింపుకుని వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ సాధనకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రూ.25లకే జాతీయ పతాకం

గుంటూరు సిటీ, ఆగస్టు 14 : హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోస్టాఫీసుల్లో రూ.70 విలువ చేసే జాతీయపతాకం రూ.25కే విక్రయిస్తున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఉసర్తి యలమందయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని రెండు హెడ్ పోస్టాఫీసులు, 53 సబ్ పోస్టాఫీసులతో పాటు 125 బ్రాంచి ఆఫీసుల్లో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. గుంటూరు డివిజన్ పరిధిలో ఇప్పటికే 11,400 జాతీయ పతాకాలు తమకు అందాయని, వీటిని ప్రజలకు అందచేయటానికి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటున్నారని ఆయన తెలిపారు.



కలుషిత నీటికి కారణమైన బోరింగ్‌ను సీజ్ చేయిస్తున్న పల్నాడు డీఎంహెచ్‌వో

దడపుట్టిస్తున్న డయేరియా

● వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
● కలుషిత నీరే కారణ మంటున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

క్రోసూరు, ఆగస్టు 14 : క్రోసూరు మండలం హసానాబాద్‌లో డయేరియా దడపుట్టిస్తోంది. ఇప్పటికే సుమారు 50 మంది బాధితులు సత్తెనపల్లి, గుంటూరు, పిడుగురాళ్ల, క్రోసూరు, రెడ్డిగూడెంలలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి ప్రబలటానికి కలుషిత నీరే కారణమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ధ్రువీకరించారు. హసానాబాద్‌లో దొడ్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం శిబిరాన్ని డీఎంహెచ్‌వో బీ.రవికుమార్ సందర్శించారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. వ్యాధి ప్రబలటానికి గ్రామంలోని బోరింగ్ నుంచి వచ్చే కలుషిత నీరే కారణమని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ మహమ్మద్ సాద్ తెలిపారు. పూర్తిగా జీరో కేసులు నమోదయ్యేవరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి నాణ్యమైన నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన సత్తెనపల్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరి చందనతో పాటు కమ్యూనిటీహెల్త్ అధికారి దివ్య, ఏఎన్ఎం ప్రసన్న వైద్యసేవలందిస్తున్నారు.

డయేరియాతో ఇద్దరు మృతి

కారంపూడి, ఆగస్టు 14: మండలంలోని ఒప్పిచర్లకు చెందిన చేపూరి కమలమ్మ (91), వంకాయలపాటి సత్యం (75) డయేరియాతో బాధపడుతూ బుధవారం మృతిచెందినట్లు డాక్టర్ రమ్య తెలిపారు. కమలమ్మ పిడుగురాళ్లలో, సత్యం నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు తెలిపారు. బుధవారం గ్రామంలో మరో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు. బత్తుల రాజేశ్వరి, కోటమ్మలు డయేరియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలోని పొట్టి శ్రీరాములు కాలనీలో ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులపై విచారణ చేపట్టామన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యంపై సిబ్బందికి సూచనలు చేశారు.

భోజనంలో పురుగులు వస్తున్నాయి

● ఏఎన్‌యూలో విద్యార్థినుల ఆందోళన
● రిజిస్ట్రార్‌కి వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నేతలు

పెదకాకాని, ఆగస్టు 14: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్ మెస్ భోజనంలో పురుగులు రావటం దారుణమని ఎస్ఎఫ్ఐ నేతలు అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ యూనివర్సిటీ మహిళా హాస్టల్ మెస్‌లో విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని, ఈ విషయంపై నెల రోజుల నుంచి పలుమార్లు చీఫ్ వార్డెన్‌కి చెప్పినా కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. భోజనంలో పులుగు రావటం, భోజనం సరిగా లేకపోవడం పదేపదే జరుగుతుందన్నారు. హాస్టల్లో మెస్ కమిటీ లేకపోవడంతో మెస్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించి, నాణ్యమైన, రుచి కరమైన భోజనాన్ని విద్యార్థినులకు అందించాలని రిజిస్ట్రార్‌ని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ సెక్రెటరీ కే.నవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, మరియమ్మ, రిచా, మౌనిక, జిల్లా జాయింట్ సెక్రెటరీ పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

● గుంటూరు మీదగా నరసపూర్, సికింద్రాబాద్, కాకినాడ టౌన్‌కు..

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీదృష్ట్యా గుంటూరు మీదగా నరసపూర్, సికింద్రాబాద్, కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07169 నరసపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 10.50కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.03కి పిడుగురాళ్ల, 12.25కి నడికుడి మరుసటి రోజు ఉదయం 5గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెంబరు. 07170 సికింద్రాబాద్ - నరసపూర్ రైలు ఈనెల 19న సోమవారం సాయంత్రం 6.20కి బయలుదేరి రాత్రి 8.49కి నడికుడి, 9.10కి పిడుగురాళ్ల, 9.39కి సత్తెనపల్లి, 10.50కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నరసపూర్ చేరుకొంటుంది. నెంబరు. 07187 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈనెల 17,19 తేదీల్లో రాత్రి 9గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 9.05కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెంబరు. 07188 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 18, 20 తేదీల్లో సాయంత్రం 6.20కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

47,894 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 49,968 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 47,894 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 25,370 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16000
నెంబరు. 5	9000	12000
273	11500	12500
341	8000	16000
4884	--	--
సూపర్ 10	10000	10000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18800
బ్యాడిగి	8000	15500
దేవనూరు డీలక్స్	8500	11500
తెల్లకాయలు	4500	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	16000
నెంబరు. 5	11500	13000
273	--	--
341	9000	16000
4884	10000	14000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500
బ్యాడిగి	9000	15500
దేవనూరు డీలక్స్	9500	12000
తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఇంటింటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

● రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్


జాతీయ జెండాతో కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, ఆగస్టు 14 : ఇంటింటిపై జాతీయ జెండా ఎగుర వేసే కార్యక్రమం జయప్రదంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం అమరావతి నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరంగా యాత్ర కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని చెప్పారు. భారతప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జాతీయ జెండాలతో సెల్ఫీ ఫొటోలు తీసుకొని హర్‌ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజలలో జాతీయభావాన్ని నింపాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో జాతీయ పతకావిష్కరణ కార్యక్రమాలు జరపాలన్నారు. కార్యక్రమాల నిర్వహణపై విస్తృత ప్రచారం, ప్రదర్శన నిర్వహించాలన్నారు. ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించటానికి అధికారులంతా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాలకు సైతం జాతీయ పతాకాలను పెట్టుకొని పట్టణాలలో ప్రదర్శన చేసేలా విస్తృత ప్రచారం చేశారు. అనంతరం కలెక్టర్ జె.వెంకటమురళీ జాతీయజెండాను చేతబూని ఫొటోలు దిగి హర్‌ఘర్ తిరంగ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రజలంతా ఇదే మాదిరిగా జాతీయ జెండాలతో సెల్ఫీలు తీసుకొని వెబ్‌సైట్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

బాపట్ల రూరల్, ఆగస్టు 14 : డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు బాపట్ల కొత్తబస్టాండ్ దగ్గర నుంచి కళాశాల వరకు హర్‌ఘర్ తిరంగ ర్యాలీని మువ్వన్నెల జెండాలతో నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీస్మిత్ మాట్లాడుతూ దేశసమైక్యతను సగర్వంగా చాటి చెప్పేందుకు ప్రతి పౌరుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. డాక్టర్ ఎస్.అశోక్‌కుమార్, డాక్టర్ కె.లావణ్యకార్తీక, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరిగా జాతీయ జెండా

బాపట్ల, ఆగస్టు 14 : ఉద్యమాలకు ఊపిరిగా, సమరయోధులకు ఆయుధంగా నిలిచిన మన జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య ఘనకీర్తి చిరస్మరణీయమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో బుధవారం బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ జాతీయ జెండా మన అస్థిత్వానికి చిహ్నమని, పౌరుషానికి ప్రతీక అని అన్నారు. తెలుగువారి గౌరవాన్ని సమున్నతంగా పింగళివెంకయ్య నిలబెట్టారని కొనియాడారు. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కజోడ్ మాల్‌మీనా, ఏవీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, దుర్గా, సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకొని కబ్జాలు

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్‌నారాయణ

బాపట్ల, ఆగస్టు 14 : అధికారం అడ్డుపెట్టుకొని జోగి రమేష్ కబ్జాలకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ విమర్శించారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ అవకాశవాదిలా మాట్లాడుతున్న జోగి రమేష్ ఆనాడు చంద్రబాబు ఇంటిపై దాడి చేసినప్పుడు ఏం మాట్లాడావు, అమర్‌నాథ్ గౌడ్‌ని తగలబెడితే ఏం మాట్లాడావో చెప్పాలన్నారు. కుటుంబ లబ్ధి కోసం చేసిన భూ ఆక్రమణలు రుజువు అవుతుంటే ఇప్పుడు బీసీకులమంటూ మాట్లాడి తప్పించుకోవాలని చూడటం సిగ్గుచేటు అన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడిన జోగి రమేష్

● సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి

బాపట్ల, ఆగస్టు 14 : మాజీ మంత్రి జోగి రమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి విమర్శించారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌కు చెందిన భూమిని బంధువులతో కలిసి కుట్రతో అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా కొని తిరిగి అమ్మటం వెనుక జోగి రమేష్ అధికార దుర్వినియోగం ఉందన్నారు. తన కొడుకును అధికార మదంతో సీఐడీ స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ దుస్సాహసానికి పాల్పడే క్రిమినల్‌గా మార్చిన దుర్మార్గపు మాజీ మంత్రి రమేష్‌దేనని కొల్లా పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల కేంద్రంలో న్యాయ సలహా సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న సభ్యులు శామ్యూల్‌జాన్, ప్రసాదరావు

కర్లపాలెం, ఆగస్టు 14 : ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన సేవలందించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని న్యాయ సలహా సభ్యులు శామ్యూల్ జాన్, పి.ప్రసాదరావు అన్నారు. కర్లపాలెం ఇందిరానగర్‌లోని ప్రత్యేక అవసరాల కేంద్రంలో బుధవారం చిన్నారుల తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు గురించి ఐఆర్‌టీ ఉపాధ్యాయురాలు నరాలశెట్టి లక్ష్మీప్రసన్న, సీహెచ్ చందన్‌లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తీరప్రాంత గ్రామాలలో ఉన్నారని, వారికి సేవలందించటానికి కేంద్రానికి వచ్చేందుకు వాహనం ఏర్పాటు చేయాలని సలహా సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి, నరాలశెట్టి లక్ష్మీప్రసన్న, సి.హెచ్.చందన, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలపై పట్టు సాధించాలి : ఎంపీపీ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 14 : సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలపై ప్రజలకు అభివృద్ధి చేసే విధంగా పట్టుసాధించాలని పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు అన్నారు. పిట్టలవానిపాలెం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు నిర్వహించిన ప్రిపరేషన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంపీడీవో భవనం మారుతీశేషమాంబ అధ్యక్షత వహించారు. సమావేశంలో గ్రామపంచాయతీ విధివిధానాలపై పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులకు శిక్షకులుగా పాల్గొన్న ఎంవోటి శ్రీనివాసరావు, పివోటి బి.వీరేంద్రబాబు పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.పద్మజ, కార్యాలయ సూపరింటెండెంట్ వి.మధుసూదనరెడ్డి, సర్పంచ్‌లు మంతెన గంగరాజు, దబ్బకూటి మాధవరావు, బొలగాని అరుణకుమారి, ఏత్రి అశ్విని, యెనుముల పార్వతి, లక్కంరాజు ఆదిలక్ష్మి, కుంటం అనూష, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఎంపీడీవో భవనం మారుతీశేషమాంబ తదితరులు

ప్రభుత్వ స్థల జాబితా సిద్ధం చేయాలి : తహసీల్దార్

కర్లపాలెం, ఆగస్టు 14 : మండలంలోని వీఆర్వోలందరూ ఆయా గ్రామాల పరిధిలో ప్రభుత్వభూముల జాబితాను సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం అన్నారు. కర్లపాలెంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు, మండల సర్వేయర్, ఆర్‌ఐలతో తహసీల్దార్ వెంకటరత్నం సమావేశం నిర్వహించారు. మండలంలో నీటితీరువా శిస్తును నూరుశాతం వసూళ్లు చేయాలని దిశ, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సలీమా, ఆర్‌ఐ కర్రి శ్రీనివాసరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య' చట్టబద్ధంగా అమలు పర్చాలి

● కలెక్టర్ జె.వెంకట మురళీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, ఆగస్టు 14 : మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చట్టబద్ధంగా అమలుపర్చాలని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. సీడబ్ల్యూసీ మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో నిర్వహించారు. జువెనల్ జస్టిస్ చట్టం పక్కగా అమలు చేస్తేనే చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నిరాశ్రయులైన చిన్నారులు, అనాధబాలలు, సమస్యలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంక్షేమం కొరకు కేంద్రప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద వితంతు పిల్లలు, అనాథలు, విడాకులు పొందిన స్త్రీ పిల్లలు, నిరాధారణకు గురైన వారంతా అర్హులేనన్నారు. ప్రతినెల రూ.4 వేల పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 318 మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూర్చటానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 493 దరఖాస్తులు వచ్చాయన్నారు. నిబంధనల మేరకు వాటిని పునఃపరిశీలించాలన్నారు. చిన్నారుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.96 వేలు ఉన్నవారంతా అర్హులని చెప్పారు. జేవీవీ చట్టం కింద దరఖాస్తులను పరిశీలించిన తదుపరి అర్హత పొందిన వివరాలను నివేదించాలన్నారు. చిన్నారులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని ఆయన స్పష్టం చేశారు. బాలల సంక్షేమ మండలి పని తీరుపై ఆరా తీశారు. ఈ సమావేశంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, బాలల సంక్షేమ మండలి ఛైర్మన్ ప్రమీల, సభ్యురాలు దుర్గాభవానీ, డీసీపీవో పురుషోత్తం, పీవో స్వప్నప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు సంబంధించిన గోడపత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు ఆవిష్కరించే నూతన ప్రయోగాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు విద్యార్థులు ప్రయోగాల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయవచ్చు అని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రయోగాలకు ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. 2022వ సంవత్సరంలో బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం నుంచి ఒక విద్యార్థి ఎంపికై బహుమతి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఇన్‌చార్జి డీఈవో జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో గంధం రవీందర్, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు హాజరుకానున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఆగస్టు 14 : నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో గురువారం జరుగనున్న స్వాతంత్ర్య వేడుకలకు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొంటారని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు శ్రీకృష్ణ చైతన్య పబ్లిక్ స్కూల్ వద్ద జరిగే వేడుకల్లో పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

సర్పంచ్‌ల అవగాహన సదస్సు

కర్లపాలెం, ఆగస్టు 14 : మండలంలోని సర్పంచ్‌లు అందరూ విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి అన్నారు. కర్లపాలెం మండలప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్పంచ్‌ల అవగాహన సదస్సులో జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, ఎంపీపీ యారం వనజ ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఎంపీపీ వనజ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలని, నిధుల కొరకు పోటీపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఏలీషాబాబు, ఏవో ఫైజుద్దీన్ పాల్గొన్నారు.

వితంతు పెన్షన్‌లపై అవగాహన

అమృతలూరు, ఆగస్టు 14 : తెనాలి కోర్టు వారి ఆదేశానుసారం బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు అమృతలూరులో నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సదస్సులో న్యాయవాదులు షేక్ ఖాదర్‌హుస్సేన్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వితంతు పెన్షన్‌లపై వితంతువులకు అవగాహన కల్పించారు. వితంతువులకు ఎవరికైనా పెన్షన్ రాకపోతే వారు ఆర్జీ అందజేయాలని సూచించారు. వాటిని కోర్టు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వీలు రవీంద్ర, మురళీకృష్ణ, సూపరింటెండెంట్ వాణి, రమాదేవి పాల్గొన్నారు.

సీనియర్ కార్యకర్తకు విజయబాబు నివాళి

కొల్లూరు, ఆగస్టు 14 : టీడీపీ సీనియర్ కార్యకర్త నాగేంద్ర ప్రసాద్‌కు టీడీపీ నేత జొన్నలగడ్డ విజయబాబు నివాళులర్పించారు. కొల్లూరులోని నాగేంద్ర ప్రసాద్ స్వగృహంలో బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువ కార్యకర్త, మృతుని కుమారుడు మోహన్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 14 : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో సర్పంచ్, కార్యదర్శులు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధికి ఎలా తోడ్పాటు అందించాలి అనే దానిపై శిక్షకులు వివరించారు.

ఎంపీడీవోగా చంద్రశేఖరరావు బాధ్యతల స్వీకరణ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 14 : ఎంపీడీవోగా జి.చంద్రశేఖరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికలు ముగియడంతో ఏ జిల్లాకు చెందిన అధికారులను తిరిగి ఆ జిల్లాలకు బదిలీ చేయడంతో భట్టిప్రోలు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

17 స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 14 : పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నిక జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడిందని పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 17న ఉదయం 9 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు జరుగుతాయని విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు చెప్పారు. వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థి తల్లి లేక తండ్రి విధిగా హాజరుకావాలన్నారు.

కర్లపాలెం పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు

కర్లపాలెం, ఆగస్టు 14 : కర్లపాలెం పంచాయతీ పరిధిలో బుధవారం కార్యదర్శి మోడి శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇసుకచానల్ నుంచి తీసిన వ్యర్థాలను, మట్టిని ట్రాక్టర్‌ల ద్వారా బయటకు తరలించారు. పంచాయతీపరిధిలోని సత్యవతిపేటలో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రత్నకుమారి తదితరులు ఉన్నారు.

వేడి గంజిపడి చికిత్స పొందుతూ మహిళ మృతి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 14 : వంట చేస్తుండగా వేడి గంజి, అన్నం ఒంటిపైపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఇది. మండలంలోని చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ చెప్పిన కథనం ప్రకారం పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామానికి చెందిన మంతెన వెంకట నరసమ్మ (58) చిన్న శుభకార్యాలకు వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తుందని, గత నెల అదేగ్రామంలో ఆమె వంట పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు వేడి గంజి, అన్నం వంటిమీదపడి కాలిగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టంనిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి తీవ్రగాయాలు

బాపట్లరూరల్, ఆగస్టు 14 : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల పట్టణం కన్యకాపరమేశ్వరి గుడి సమీపంలో రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో బాపట్ల మండలం పాండురంగాపురంనకు చెందిన వెంకటగోపాల్‌రెడ్డి కాలికి తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై బాపట్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గోపి కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

బీమా చెక్కు అందజేత

రేపల్లె, ఆగస్టు 14: ఆపదలో ఉన్న టీడీపీ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఇటీవల నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన పలగాని గోపీ ప్రమాదవశాత్తూ మరణించడంతో టీడీపీ సభ్యత్వ బీమా ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును గోపీ కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. ఈసందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ బీమా మంజూరుకు కృషి చేశారన్నారు. ఆపదలో ఉన్న టీడీపీ కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మండల టీడీపీ అధ్యక్షుడు ఓగిబోయిన వెంకటయాదవ్, బొర్రా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శివపార్వతి


కె.శివపార్వతి

రేపల్లె, ఆగస్టు 14: మండల పరిషత్తు అధికారిణిగా కె.శివపార్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈసందర్భంగా శివపార్వతికి కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

నగరం తహసీల్దారుగా నాంచారయ్య


నాంచారయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నగరం, ఆగస్టు 14 : ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తహసీల్దారు జి.నాంచారయ్య అన్నారు. నగరం మండల తహసీల్దారుగా జి.నాంచారయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీపై నగరం తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించానని అన్నారు. మండల పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది దుశ్శాలువాలు, పూలమాలలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నగరం ఎస్ఐగా బండ్ల భార్గవ్


ఎస్ఐ భార్గవ్

నగరం, ఆగస్టు 14: మండలంలోని శాంతి భద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తానని ఎస్ఐ బండ్ల భార్గవ్ అన్నారు. నగరం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా భార్గవ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పొన్నూరులో ఎస్ఐగా విధులు నిర్వహించారు. సాధారణ బదిల్లో భాగంగా నగరంనకు వచ్చినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానన్నారు. పోలీసులు, ప్రజలు స్నేహపూరితమైన వాతావరణాన్ని కలిగి ఉండాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఎస్ఐకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఆరోపణలపై విచారణ చేపట్టిన అధికారులు

అమృతలూరు, ఆగస్టు 14 : అమృతలూరు పంచాయతీ కార్యాలయంలో అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. 2021-22వ సంవత్సరంలో పంచాయతీ ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ గ్రామానికి చెందిన వీరగంధం శ్రీనివాసరావు టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో ఈనెల 9న ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు పరిశీలించిన రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు రేపల్లె డీఎల్‌పీవోను విచారణకు ఆదేశించారు. రేపల్లె ఇన్‌చార్జి డీఎల్‌పీవో నరసింహారావు ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలన చేపట్టారు. గతంలో పని చేసిన కార్యదర్శులు హాజరుకావాలని నోటీసులు ఇవ్వగా ఒక కార్యదర్శి అనారోగ్యం కారణంగా హాజరుకాలేదని చెప్పారు. రికార్డుల పూర్తి పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 14 : కాలనీల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎం.హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజుల కార్యచరణ మేరకు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖాధికారులకు సూచించారు. సచివాలయాల వారీగా ప్రతి వారానికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వాటిని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఈవోపీఆర్‌డీ ఊహారాణి, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


పురాణ కాలక్షేప మండపనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పురాణ కాలక్షేప మండప నిర్మాణానికి శంకుస్థాపన

బాపట్ల, ఆగస్టు 14 : పట్టణంలోని సూర్యలంకరోడ్డులో ఉన్న శ్రీసువర్చల సమేత ప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయం జీర్ణోద్ధారణ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న పురాణ కాలక్షేప మండపానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం శంకుస్థాపన చేశారు. శాస్త్రోక్తంగా పూజలు జరిపి వేదపండితుల మంత్రోచ్ఛరణతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బ్రహ్మాండం బాలనారాయణ, జి.గిరిజారాణి, అల్లం గోపికృష్ణ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, చాపల సోమయ్య టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, జనసేన, బీజేపీ నాయకులు, పండితులు పాల్గొన్నారు.

రేపు జిల్లా పరిషత్ భూములు లీజుకు వేలం

కర్లపాలెం, ఆగస్టు 14 : గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందిన 4 ఎకరాల 3 సెంట్ల వ్యవసాయ భూమిని 2024-2025 సంవత్సరానికి లీజు హక్కుల కొరకు అప్‌సెట్ ధర రూ.62 వేలుగా నిర్ణయించి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని మండలాభివృద్ధి అధికారి ఎ.ఏలీషాబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.



చిల్లకంపను తొలగిస్తున్న జనకవరం గ్రామస్థులు

చిల్లకంప తొలగింపు

పంగులూరు, ఆగస్టు 14 : మండల కేంద్రమైన పంగులూరులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మధ్య దట్టంగా పెరిగిన చిల్ల కంపను సచివాలయం - 2 పరిధిలోని జనకవరం గ్రామస్థులు స్వచ్ఛందంగా తొలగించే పనులు చేపట్టారు. టీడీపీ నాయకుడు, జనకవరం గ్రామానికి చెందిన గుర్రం ఆదిశేఖర్ 15 మంది కూలీలతో పంగులూరులోని రెవెన్యూ కార్యాలయం, సచివాలయం - 2, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, వెలుగు కార్యాలయాల మధ్య పరిసరాలలో పెరిగిన చిల్ల కంపను తొలగించి శుభ్రం చేయించారు. ఆదిశేఖర్‌ను పలువురు అభినందించారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ

పంగులూరు, ఆగస్టు 14 : గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శుల మూడురోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. గ్రామాలలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, పరిశీలన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు ఈవోఆర్డీ రాంబాబు, రమేష్‌బాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- గున్యాతో అందరికీ నొప్పులు
- ముక్తేశ్వరం, కూకట్లపల్లి యానాది సంఘంలో పెద్ద ఎత్తున రోగులు
- కోలుకుంటున్న అంబడిపూడి
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పడకేసిన పారిశుధ్యం
- కనిపించని వైద్య శిబిరాలు
- ఆందోళనలో ప్రజలు



ముక్తేశ్వరంలో విష జ్వరాలతో మంచం పట్టిన కుటుంబం.. గున్యాతో బాధపడుతున్న వృద్ధురాలు

బల్లికురవ, ఆగస్టు 14 : గ్రామాలలో రోజు రోజుకు జ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గత నెలలో అంబడిపూడి గ్రామాన్ని చికున్ గున్యా, విషజ్వరాలు పీడించగా ఇప్పుడు పలు గ్రామాలకు వ్యాప్తి చెందుతున్నాయి. తాజాగా ముక్తేశ్వరం, కూకట్లపల్లి యానాది సంఘంలో నాలుగు రోజుల వ్యవధిలోనే విష జ్వరాలు గున్యా నొప్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. జ్వరం ఇంటిలో ఉన్న వారందరికీ వస్తుందని ఎవరు కదల లేని స్థితిలో ఉంటున్నారని వాపోతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇలాంటి జ్వరాలు వస్తున్నాయని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా చేయడం లేదని, ఏదో మమ అంటు పైపైన వ్యర్థాలను తీసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన వీధులలో చిన్న పాటి వర్షాలు కురిస్తే మురుగు కాలువల్లో మురుగు రోడ్లపైకి వస్తుందని దీంతో దోమల బెడద కూడా అధికమవుతుందని ప్రజలు తెలిపారు. మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గత మూడు రోజుల వ్యవధిలోనే 50 మంది వరకు జ్వరాల బారిన పడి మంచాలను పట్టారు. జ్వరాన పడిన వారి కీళ్ల పట్టుకు పోతున్నాయని తీవ్ర నొప్పులతో నడవలేక మంచానపడుతున్నామని చెప్తున్నారు. గ్రామంలోని ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుందని అక్కడి ప్రజలు తెలిపారు. కొందరు జ్వరాలను చూసి భయపడి పట్టణ ప్రాంతాలకు వెలుతున్నారన్నారు. సీజనల్ జ్వరాలు గ్రామాలలో అధికంగా ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ సరిగా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు వచ్చిన గ్రామాలలో శిబిరాలను ఏర్పాటు చేసి అదుపులోకి వచ్చే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో వెంటనే విష జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని లేకుంటే ముందు ముందు తీవ్రత పెరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



ఇంటి ముందు నిలిచి ఉన్న మురుగు

బీఎల్‌వోల సమస్యలపై స్పందించిన మంత్రి

కలెక్టర్‌కు వివరించిన గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : బీఎల్‌వోలకు 2024 ఎన్నికలల్లో విధులు నిర్వహించిన వారికి వేతనాలు చెల్లింపులకు సంబంధించిన సమస్యలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీజీఎస్‌డబ్ల్యుఎస్‌వో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాము కలిసి వివరించారు. స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెంటనే కలెక్టర్ వెంకట మురళికి విషయాన్ని వివరించారు. దీంతో బుధవారం అధ్యక్షుడు రాము, ఏబేలు, రేణుతోపాటు పలువురు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. 2024 ఎన్నికలల్లో విధులు నిర్వహించిన బీఎల్‌వోలకు రావాల్సిన గౌరవ వేతనాలను గురించి వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకట మురళి సమస్యను పరిష్కరించేందుకు తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారని నాయకులు రాము తెలిపారు. దీని వలన జిల్లాలోని 2వేల మంది బీఎల్‌వోలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంపీడీవోగా నేతాజీ బాధ్యతల స్వీకరణ

చీరాలటౌన్, ఆగస్టు 14 : చీరాల ఎంపీడీవోగా నేతాజీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చీరాలలో రెగ్యులర్‌గా పని చేస్తు న్న నేతాజీ ఎన్నికల విధుల కోసం బాపట్ల మండలం కర్లపాలెంకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇక్కడ బాధ్యతలు స్వీకరించగా, శోభారాణిని పల్నాడు జిల్లా దాచేపల్లికి బదిలీ చేశారు. నేతాజీకు కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. మండల అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఎంపీడీవో కోరారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

ఇంకొల్లు ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి

ఇంకొల్లు, ఆగస్టు 14 : ఇంకొల్లు ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీదేవి బదిలీ అయ్యారు. రాజ్యలక్ష్మి ఎన్నికల సమయంలో రాజ్యలక్ష్మి ఇక్కడి నుంచి బదిలీ కాగా తిరిగి బాధ్యతలు స్వీకరించారు.

జె.పంగులూరుకు రామాంజనేయులు

పంగులూరు, ఆగస్టు 14 : జె.పంగులూరు ఎంపీడీవోగా బి.రామాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రామాంజనేయులు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరిగి జె.పంగులూరుకు నియమితులయ్యారు.



ఎన్ఆర్‌జీఎస్ పనులపై సమీక్ష

పంగులూరు, ఆగస్టు 14 : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌జీఎస్, హౌసింగ్ సిబ్బందితో ఎంపీడీవో రామాంజనేయులు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ పనిదినాలు, హార్టీకల్చర్, షెల్ఫ్ ఆఫ్ వర్క్‌పై చర్చించారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి పథకం క్షేత్ర సహాయకులు, గృహ నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

కొరిశపాడు ఎస్ఐగా సురేష్

మేదరమెట్ల, ఆగస్టు 14 : మండలంలోని కొరిశపాడు పోలిస్‌స్టేషన్ ఎస్ఐగా సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకుపల్లి పోలిస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఐ శివయ్య బట్టిప్రోలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపై కఠినంగా వ్యహరిస్తామని హెచ్చరించారు. మండలంలోని ప్రజలు సమస్యలపై తనను స్టేషన్‌లో కలవవచ్చన్నారు.



గులాబీ పురుగును నివారించుకోవాలి

పర్చూరు, ఆగస్టు 14 : ప్రత్తి పంటలో గులాబీ పురుగును తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపూడి గ్రామంలో రైతులు సాగుచేసుకున్న ప్రత్తి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ ప్రత్తి పైరులో గులాబీ పురుగు వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పురుగును తొలిదశలో గాని, పూతదశలో గాని నివారించుకోవాలని తెలిపారు. పురుగు గుడ్డు దశలో ఉన్నప్పుడు వేప గింజల కషాయాన్ని కానీ, ప్రోఫ్ నోఫాస్ 2ఎంఎల్/లీటరు లేదా తయడికర్బ్ 1.5 గ్రామ్ కానీ పిచికారీ చేయాలన్నారు. దీంతోపాటు ఎకరానికి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



పత్తి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ మోహనరావు



గోశాలకు దాతలు పంపిన వరిగడ్డి

గో మేతకు దాతల వెల్లువ

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకిలోని హరిహర గోకులంలో ఉన్న ఆవుల ఆకలి తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. ఇప్పటికే పలువురు నగదు అందజేయగా, బుధవారం మరికొందరు దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేశారు. అద్దేపల్లి అశోక్ రూ.50,116, పీఏసీఎస్ కోటేశ్వరరావు రూ.7,500, కొప్పురావూరి రమ బ్రహ్మం రూ.2వేలు, నాగసూరి సుబ్బారావు తన మనవుడు పుట్టిన రోజు సందర్భంగా రెండు ట్రాక్టర్‌ల పచిగడ్డిని అందజేశారు. అద్దంకి పట్టణంలో నివాసం ఉంటున్న రాజస్థాన్ యువకులు గోవుల మేతకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నాగసూరి సత్యనారాయణ సుమారు 16 వేల రూపాయల విలువైన వరి గడ్డి ని అందజేశారు. ఆవుల మేత కు సహకరిస్తున్న దాతలకు గోశాల నిర్వహకుడు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక ఎదుగుదల లేని పిల్లలకు సాయం



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు, న్యాయవాదులు

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : మానసిక ఎదుగుదల లేని పిల్లలకు చట్టాలలో న్యాయపరంగా ఎన్నో వెసులుబాటులు ఉన్నాయని వాటిని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. బుధవారం అద్దంకిలోని సత్రం బడిలోని భవిత కేంద్రాంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు హెచ్ఎం ఇ.రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న న్యాయవాదులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ మానసిక వైకల్యం ఉన్న వారికి న్యాయ సాయాన్ని న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తుందన్నారు. మరో న్యాయవాది మర్తా శ్రీనివాసరావు చిన్నారుల తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

బల్లికురవ, ఆగస్టు 14 : గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా నిరంతరం పారిశుధ్య పనులు చేయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్, చెత్త సంపద కేంద్రాల వినియోగంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులతో రాంబాబు మాట్లాడుతూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ శిక్షణలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

సర్వత్రా హర్షం

చీరాల, ఆగస్టు 14 : హైస్కూల్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అన్న క్యాంటీన్ తమకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందని పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య అల్పాహారంతో ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించినట్లు మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. బుధవారం క్యాంటీన్‌కు సంబంధించిన తుది మెరుగులను పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.4లక్షలు మొత్తం రూ.9లక్షల వ్యయంతో అన్ని వసతులతో అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమైంది. క్యాంటీన్ లోపల ఒడ్డనకు, తినేవారికి సదుపాయంగా ఉండేవిధంగా వసతి ఏర్పాటు చేశారు. ఇక వెలుపల లాన్, మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడం, అన్న క్యాంటీన్ పునః ప్రారంభించడం పట్ల పేదలతో పాటు అన్ని వర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జరిగే ప్రా రంభ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు.



ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పశు పోషకులకు మెరుగైన సేవలు

విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 14 : పశుపోషకులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి పశు కాపరులకు సంబంధించి ఒక్కో కుటుంబానికి 3 కేజీల చొప్పున పశుగ్రాస విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నారు. ఆ నేపథ్యంలో ముందస్తుగా కొందరు లబ్ధిదారులకు విత్తనాల కిట్లను ఎమ్మెల్యే కొండయ్య బుధవారం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుపోషకులు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు, వేటపాలెం వైద్యాధికారి పుష్పలత, చల్లారెడ్డిపాలెం డాక్టర్ కృష్ణఅంజనేయులు, నాయకులు, కార్యకర్తలు. పశుపోషకులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

ఇంకొల్లు, ఆగస్టు 14 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఇంకొల్లులో బుధవారం డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించి బాలకార్మిక వ్యవస్థపై యజమానులకు అవగాహన కలిగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో యాక్సిస్ టు జస్టిస్ జిల్లా కోఆర్డినేటర్ కిషోర్, కానిస్టేబుల్ ఏడుకొండలు, సిఫార్డు సంస్థ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

హెచ్‌ఐవీపై అవగాహన పెంచాలి

మార్టూరు, ఆగస్టు 14 : ప్రాణాంతకమైన హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో యువత కీలకంగా భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి రాష్ట్ర కోఆర్డినేటరు డాక్టరు రాజేంద్రప్రసాద్ అన్నారు. హెచ్ఐవీపై యువతకు అవగాహన కల్పించాలని, ఈ వ్యాధి నిర్మూలనకు యువత కృషి చేయాలన్నారు. ఏపీ హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో రాష్ట్రంలో మీకు తెలుసా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బుధవారం లింక్ వర్కర్సు చైల్డ్ ఫండ్ ఇండియా, మార్టూరు హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీహర్షిణి కాలేజీలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టరు రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన యువత చేతిలోనే ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టరు ప్రోగ్రాం మేనేజరు జానీషా, రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీహరి, దుర్గ, ఎస్‌కే సల్మా, రూతు, మేనేజర్ డీ స్వరూప్, కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు పర్చూరులో అన్నదానం

పర్చూరు, ఆగస్టు 14 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు ప్రవాసాంధ్రులు మన్నెం శ్రీకాంత్‌తోపాటు, ఇతర దాతల సహకారంతో డొక్కా సీతమ్మ పేరుతో అన్న ప్రసాద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన నాయకులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



మువ్వన్నెల జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



120 అడుగుల జాతీయ జెండాతో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మేదరమెట్ల, ఆగస్టు 14 : స్వాంత్ర్య సమరయోధుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలని రాధాస్ గీతం పాఠశాల ప్రిన్సిపాల్ రాధా అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం మేదరమెట్లలో విద్యార్థినీవిద్యార్థులో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకుల వేషధారణతో జెండాలను చేతపట్టి విద్యార్థులు ఆకట్టుకున్నారు. జెండా రూపకర్త పింగళి వెంకయ్య గురించి వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. జై జవాన్, జై కిసాన్, వందేమాతరం నినాదాలతో ర్యాలీ సాగింది.

జాతీయ జెండాలు పంపిణీ

అద్దంకిటౌన్ : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. బుధవారం అద్దంకిలోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, స్థానికులకు జెండాలు పంచినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. అలాగే నర్రావారిపాలెంలకు చెందిన చాటకొండ మధుసుధన్‌రావుకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా, రోటరీ క్లబ్ సభ్యుల చొరవతో మేదరమెట్ల గ్రామానికి చెందిన దేవరకొండ రాజా రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళిసుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

120 అడుగుల జెండా ప్రదర్శన

మార్టూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మార్టూరు సెంటర్లో శ్రీహర్షిణి స్కూలు విద్యార్థులు 120 అడుగుల పొడవు గలిగిన జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ నుంచి మువ్వెన్నెల జెండాను విద్యార్థులు చేతబూని ఊరేగింపుగా ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెద్ద అండర్ పాస్ వద్ద జెండాతో మానవహారంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం అంజనేయులు, పద్మ, నీలిమ శ్యామల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ జెండా ప్రదర్శనను తిలకించిన ప్రజలు పరసించిపోయారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 14 : రైతులు తాము సాగు చేసే పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఏవో కాశీవిశ్వనాథ్ అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట-2 రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంటకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి. కావ్య, ఎస్‌కే రూఫియా, రైతులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తవ్వితే చర్యలు

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాలటౌన్, ఆగస్టు 14 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళశారం రాత్రి జోరుగా మండల పరిధిలో అక్రమ రవాణా సాగింది. ఈ విషయం సోషల్ మాధ్యమాలలో వైరల్ కావడంతో కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చీరాల మండల పరిధిలోని బోయినవారి పాలెం, తోటవారి పాలెం ప్రాంతాలలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను ఎస్ఈబీ సీఐ కర్ణతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. వీటిపై ఆయా పరిధిలోని వీఆర్వో, సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. అంతేకాకుండా స్థల యజమాలను పిలిపించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరు

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకిలో అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభం కానుంది. శుక్రవారం ఉదయం మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్‌ను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూసివేయించారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తుంది. పేదల కడుపు నింపాలన్న ఆలోచన కార్యరూపం దాల్చింది. అద్దంకి పట్టణంలో మూతపడిన అన్న క్యాంటీన్‌లో ఇప్పటివరకు నిర్వహించిన మహిళా మార్ట్‌ను ఖాళీ చేయించి సుమారు రూ.10లక్షలతో మరమ్మతులు చేసి పేదలు భోజనం చేసే వసతితో ఫర్నిచర్ సమకూర్చారు. గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్లలో జరిగే స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొనుండడంతో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం చేస్తారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని అందిస్తారు. తిరిగి అన్న క్యాంటీన్‌లు తెరవడంపై పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

సహకరించని అధికారులు, సిబ్బందిని ఉపేక్షించేది లేదు : మంత్రి రవి

వార్డులలో ప్రాధాన్యత కల్పించాలి : గొట్టిపాటిని కోరిన కౌన్సిలర్లు



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్లు

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకి పట్టణంలోని అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని, కౌన్సిలర్‌లు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి రవికుమార్‌ని అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ లు బుధవారం కలిసారు. పట్టణంలోని ఆయా వార్డులలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అదే సమయంలో ఆయా వార్డులలో కౌన్సిలర్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అద్దంకి పట్టణాభివృద్ధికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని, అన్ని వార్డులకు ఎలాంటి తేడాలు లేకుండా నిధులు కేటాయిస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఆయా వార్డులలో కౌన్సిలర్‌కు ప్రాధాన్యత ఉండే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అద్దంకి మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది పనిచేయక పోతే ఉపేక్షించాల్సిన పనిలేదని, వెంటనే బదిలీపై వెళ్లాల్సిందేనని మంత్రి అన్నట్లు తెలిసింది. త్వరలో జరిగే బదిలీలలో పనిచేయని అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లాలని చెప్పకనే చెప్పినట్లు అయింది. అధికార మార్పిడి వ్యవహారం ఒకరిద్దరు కౌన్సిలర్‌లు మంత్రి రవికుమార్ దృష్టికి చెప్పేందుకు తటపటాయిస్తుండగా, విషయం చెప్పమని అడగడంతో మనసులో మాట చెప్పినట్లు తెలుస్తుంది. రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయం అయినందున కొంతకాలం వేచి ఉండాలని, ముందు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తుంది. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్‌లు కంపా రజని, మాగులూరి తిరుపతమ్మ గోపి, సీత మ్మ, రంగిశెట్టి సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి మాధవరావు, జహీరా జిలాని, ఏజెండ్ల నాగరాజు, అంకం నాగరాజు ఉన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ప్రజలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జెండా పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలితంగానే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు.

గ్రానైట్ కార్మికుడి మృతిపై కేసు

బల్లికురవ, ఆగస్టు 14 : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వెంకట పద్మజ గ్రానైట్ ఫ్యాక్టరీ పనులు చేస్తు ప్రమాదంలో కార్మికుడు రాజు (20) మృతిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. వేమవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ వెంకట పద్మజ గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి రాజస్థాన్‌కు చెందిన కార్మికుడు రాజు ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. చైన్ తెగి రాయి కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీఆర్వో పూర్ణిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచెరువులో వ్యక్తి మృతదేహం

మార్టూరు, ఆగస్టు 14 : మండల పరిధిలో నాగరాజుపల్లి ఎర్ర చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు బుధవారం మార్టూరు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ విషయమై సమాచారం అందడంతో రాత్రి 8 గంటల సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అయితే చెరువు లోపలి ప్రదేశం బురదగా ఉండడంతో మృతదేహాన్ని అక్కడి నుంచి బయటకు తరలించడానికి పోలీసులు ఎంతో ఇబ్బంది పడ్డారు. చనిపోయిన వ్యక్తి ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. ఏఎస్ఐ మహమ్మద్ బాషా మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెల్లలచెరువులో యువకుడి ఆత్మహత్య

సంతమాగులూరు, ఆగస్టు 14 : మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సంతమాగులూరు ఎస్ఐ పీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హెన్స్‌కుమార్ (30) వెల్లలచెరువు రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న అన్న ఇంటికి వచ్చారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు బుధవారం అడవిపాలెం సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిల్లల పెంపకంలో శ్రద్ధ తీసుకోవాలి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

ఇంకొల్లు, ఆగస్టు 14 : పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని, వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ చదువుపై ఆశక్తి పెంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని పలువరు ప్రముఖులు సూచించారు. మండలంలోని వంకాయలపాడులోని సాయిరాం స్కూల్‌లో మేడూరి సత్యనారాయణ రచించిన పిల్లల పెంపకం గ్రంథాన్ని డాక్టర్ కొర్రపాటి సుధాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయిరాం స్కూల్ డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్, విద్యావేత్త సీపీ ప్రసాద్, మేడూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో టీడీపీ పాగా...

ఒంగోలులో వైసీపీకి భారీ షాక్

ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో భారీగా చేరిక

మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి తెలుగుదేశంపార్టీలోకి

అదే దారిలో మరి కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు

తూర్పునాయుడుపాలెంలో చేరికలు

పూర్తి మెజారిటీతో కార్పొరేషన్‌పై కూటమి పట్టు

రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబుకు పరిచయం

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ కైవసమైంది. వైసీపీకి చెందిన మెజారిటీ కార్పొరేటర్లు వరుసగా పార్టీలోకి క్యూకట్టారు. చాలావరకు అధికారపార్టీకి జైకొట్టారు. మేయర్, డిప్యూటీ మేయర్ కూడా సైకిలెక్కారు. దీంతో కార్పొరేషన్‌పై కూటమికి పట్టు దొరికింది. బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో ఈ మేరకు వారంతా సమావేశమై అభివృద్ధికి సహకరిస్తామని ప్రకటించారు. మేయర్‌తో సహా అందరూ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మెజార్టీ కార్పొరేటర్లు మారడంతో ఇక కార్పొరేషన్ పగ్గాలు టీడీపీ చేతికొచ్చినట్లే..



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన మేయర్, డిప్యూటీ మేయర్, కౌన్సిలర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14 : ఒంగోలులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు సైకిలెక్కారు. నగర ప్రథమ పౌరురాలు, మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ(బుజ్జి)తోపాటు మరి కొంత మంది టీడీపీలో చేరారు. బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంతూరు తూర్పునాయుడుపాలెంలో ఆయనను కలిసిన వారు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, ఎన్నికల ఫలితాల అనంతరం మరో ఏడుగురు చేరారు. ఇదిలా ఉంచితే కొద్దిరోజులుగా మేయర్ చేరికపై అనేక అనుమానాలు తలెత్తాయి. పార్టీలో చేరతారని సంకేతాలు వచ్చినప్పటికీ ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్నాలో ఆమె నేరుగా పాల్గొనడం చర్చనీయాంశమైంది. దాంతో ఆమె చేరికపై పలు అనుమానాలు నెలకొన్నాయి. ఆ తర్వాత ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఒంగోలులో, ఆ తర్వాత ఎమ్మెల్యే దామచర్లను హైదరాబాద్‌లో, ఒంగోలు రెండుసార్లు కలవడం చర్చనీయాంశమైంది. కొద్దిరోజులుగా మేయర్ చేరికపై దోబూచులాట కొనసాగగా, ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. ఈ మేరకు దామచర్ల సమక్షంలో బుధవారం టీడీపీలో చేరి ప్రజల్లో నడుస్తున్న చర్చలకు మేయర్ గంగాడ సుజాత ఫుల్‌స్టాప్ పెట్టింది. కొద్దిరోజుల క్రితం వరకు ఒంగోలు కార్పొరేషన్ వైసీపీ మెజారిటీ సభ్యులతో పాలకవర్గం కొనసాగగా, బుధవారంతో టీడీపీ కూటమి కైవసం చేసుకుంది. కార్పొరేషన్‌ను పగ్గాలు టీడీపీలోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మొదటి నుంచి పక్కా ప్రణాళికలతో అటు పార్టీశ్రేణుల అభిప్రాయాలను తీసుకున్నారు. అలాగే వైసీపీ కార్పొరేటర్లు చేరిక వల్ల ఎటువంటి ఇబ్బంది రాకుండా చూస్తానంటూ టీడీపీ శ్రేణులకు భరోసా కూడా కల్పించారు. మొత్తంగా కొద్దిరోజులుగా చర్చనీయాంశంగా మారిన వైసీపీ కార్పొరేటర్లు చేరిక ఎపిసోడ్‌కు బుధవారంతో తెరపడింది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు పదిహేడు మంది టీడీపీలో చేరగా, మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు రెండు రోజుల్లో చేరనున్నట్లు సమాచారం.

అభివృద్ధికి నిర్వచనం దామచర్ల.. అందుకే టీడీపీలోకి: మేయర్

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని చూశాం. అభివృద్ధి, సంక్షేమం చేయడంలో దామచర్ల కృషి అభినందనీయం నగర అభివృద్ధి కోసం దామచర్లతో కలిసి పనిచేయాలన్న లక్ష్యంతోనే తనతోపాటు మరి కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరాము. ఇంకా ఎన్నో సమస్యలు పెండింగ్ ఉన్నాయి. పోతురాజు కాలువ ఆధునికీకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోజు తాగునీటి సరఫరాతోపాటు, కార్పొరేషన్ కార్యాలయానికి సొంత భవనం అవసరం ఉంది. ఎమ్మెల్యే సహకారంతో వాటిని సాధించుకోగలమనే నమ్మకం ఉంది.

కార్పొరేషన్ కైవసం చేసుకున్న టీడీపీ

నగరంలో మొత్తం 50 డివిజన్‌లు ఉండగా, ఆరుగురు టీడీపీ కార్పొరేటర్లు ఉన్నారు. వారితోపాటు జనసేన కార్పొరేటర్ ఒకరు ఉండటంతో వారి సంఖ్య ఏడుకు పరిమితమైంది. అయితే ఓ కార్పొరేటర్ ఇండిపెండెంట్‌గా గెలుపొంది అప్పట్లో వైసీపీ కండువా కప్పుకున్నారు. దీంతో వైసీపీ సభ్యుల సంఖ్య 43 ఉండగా, కౌన్సిల్ సమావేశంలో వారిదే పైచేయిగా ఉండటంతోపాటు, అజెండాలో పొందుపరిచిన ప్రజావ్యతిరేక అంశాలపై ప్రతిపక్షం టీడీపీ అడ్డుపడినా, అభ్యంతరాలు తెలియజేసినా తీర్మానాలను ఏకపక్ష ఆమోదించారు. కాగా 2024 సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తదనంతర పరిణామాలతో ప్రస్తుతం కార్పొరేషన్‌లో పాలకవర్గ సభ్యుల సంఖ్య టీడీపీకి పెరగాయి. దీంతో పగ్గాలను కూటమి కైవసం చేసుకున్నట్లే. టీడీపీ-6, జనసేన-1 ఉండగా, తాజాగా 19మంది వైసీపీ సభ్యులు టీడీపీలో చేరడంతో టీడీపీ కార్పొరేటర్‌ల సంఖ్య 26కు చేరుకుంది. దాంతోపాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కార్పొరేషన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉండటంతో టీడీపీ బలం 29కి పెరిగింది. దీంతో కార్పొరేషన్ పాలకవర్గం టీడీపీ కూటమిదే.

త్వరలోనే సీఎం చంద్రబాబు వద్దకు..

బుధవారం తూర్పునాయుడు పాలెంలోని ఎమ్మెల్యే దామచర్ల స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమైనట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రకటించారు. ఎమ్మెల్యేకు సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు టీడీపీకి జైకొట్టారు. వారికి తెలుగుదేశం పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే వారితోపాటు, టీడీపీ కార్పొరేటర్లను అభినందించారు. ఇక నుంచి కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి పాలకవర్గం కొనసాగనుందని తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దకు అందరినీ తీసుకెళ్ళి పరిచయం చేయనున్నట్లు సమాచారం.

నగర అభివృద్ధి కోసమే: ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకెళతాం. గతంలో టీడీపీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నందున అభివృద్ధి కోసం పోరాడినా సాధ్యపడలేదు. అయితే తాజాగా వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడం సంతోషంగా ఉంది. ఒంగోలులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. వైసీపీలో ఉండి కూడా అభివృద్ధి చేయలేకపోయామనే భావనలో ఉన్న కార్పొరేటర్లు టీడీపీ కూటమిపై నమ్మకంతో పార్టీలో చేరడం అభినందనీయం. అందరినీ సమన్వయం చేసుకుని ఐక్యంగా, అభివృద్ధి చేయడమే మా ముందు ఉన్న లక్ష్యం. రహదారులు, డ్రైన్‌లు, రోజు నీటిసరఫరా, పోతురాజు కాలువ ఆధునికీకరణ, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టిసారించాం. రాబోయే ఐదేళ్లలో ఒంగోలు నగరాన్ని అందంగా మార్చి అభివృద్ధి చేస్తాం.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

8 నెలల్లో రూ.20 లక్షలు అక్రమంగా డ్రా

వైసీపీ అండతో తర్లుపాడు కార్యదర్శి నిర్వాకం

సర్పంచ్ భర్త సహకారంతో సొంత ఖాతాల్లోకి నిధుల మళ్లింపు

ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు



తర్లుపాడు సచివాలయం

తర్లుపాడు, ఆగస్టు 14: ప్రభుత్వం మారినా తర్లుపాడు పంచాయతీ అధికారుల తీరు మారలేదు. ఇంకా వైసీపీకి పంచాయతీ కార్యదర్శి అంటకాగుతూ యథేచ్ఛగా నిధులు గోల్‌మాల్ చేస్తున్నాడు. దీనికి తోడు ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో గత ఐదేళ్ల నుంచి ఆయన అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఎవరైనా పంచాయతీ నిధుల గురించి ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. గత 8నెలల కాలంలో రూ.20లక్షల మేర నిధులు డ్రా చేశారు. తర్లుపాడులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అవకతవకలకు పాల్పడి అక్రమంగా నిధులు డ్రా చేశారు. ఈనెల 1న గుట్టుచప్పుడు కాకుండా ఎలాంటి బిల్లులు గానీ, ఎం బుక్కులుగానీ లేకుండా రూ.4,14,606 డ్రా చేశాడు. సచివాలయం నిర్వహణ పేరుతో కార్యదర్శి సొంత అకౌంట్‌కు రూ.98,435, ప్రభాకర్ పేరుతో మోటర్ రిపేర్ కింద రూ.2,99,107, సర్పంచ్ గౌరవ వేతనం రూ.17,064 డ్రా చేశాడు. గడచిన ఫిబ్రవరిలో కూడా సచివాలయ నిర్వహణకు కార్యదర్శి సొంత అకౌంట్‌కు రూ.40,000 డ్రాచేశాడు. ఏప్రిల్‌లో రూ.60,000, మేలో రూ.25వేలు సచివాలయం నిర్వహణ పేరుతో డ్రా చేశాడు. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద చెత్త ట్రాక్టర్ డీజిల్ కోసం రూ.2,61,108, బ్లీచింగ్, సున్నంకు రూ.2,17,660, బోర్ల రిపేర్ కింద రూ.6లక్షలు, కాలువల పూడికతీత పనుల కోసం రెండుమార్లు రూ.1,35,000, వీధిలైట్ల కోసం రూ.1,35,000 ఇలా నిధులు డ్రా చేసి మింగేశాడు. గత ఏడాది నుంచి తర్లుపాడులో లైట్లు వేసిన దాఖలాలు లేవు. పారిశుధ్యం మచ్చుకు కూడా కనపించలేదు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే పంచాయతీ నిధులు అక్రమంగా డ్రా చేసిన విషయం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. రెండు నెలల క్రితం ఒక విలేకరి తర్లుపాడు పంచాయతీ నిధుల గురించి సమాచారం అడిగితే ఆయనపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అదే సమయంలో పంచాయతీ రికార్డులు పోయాయంటూ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో భాస్కర్‌రెడ్డిపై కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 45 రోజుల క్రితం తర్లుపాడు పంచాయతీ నిధుల వివరాలు ఇవ్వాలని టీడీపీ యువనాయకుడు కందుల రోహిత్ రెడ్డి, మరో 20 మంది నాయకులతో కలిసి లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవు. గతంలో ఈవోపీఆర్‌డీగా అమరేశ్వరరావు విధులపట్ల అంకితభావంతో పనిచేశాడు. ఆయన వైసీపీ సర్పంచ్‌లు చేసే అవకతవకలపై సంతకాలు చేయలేదనే ఉద్దేశంతో 2నెలల పాటు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో తర్లుపాడు కార్యదర్శి అచ్యుత్‌రావుకు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు ఇచ్చారు. వైసీపీ నాయకులతో అంటకాగుతున్న కార్యదర్శి అచ్యుత్‌రావు వారు ఏం చెబితే అదే వేదంగా పనిచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి డబ్బులు డ్రా చేసుకోకూడదు. ఆ నిబంధనలు తుంగలోకి తొక్కి కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి నిధులు డ్రా చేసుకున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు లేకుండా నిధులు డ్రా వాస్తవమే

తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి ఎలాంటి బిల్లులు లేకుండా ఈనెల 1న రూ.4,14,606 నిధులు డ్రా చేసిన మాట వాస్తవమేనని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ తెలిపారు. తర్లుపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

700మీటర్ల జెండా ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే



నగరంలో జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14: ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక చర్చి సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 700 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనను కలెక్టర్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేలా సెల్ఫీ పాయింట్లు, తిరంగా సిగ్నేచర్ క్యాంపెయినింగ్, తిరంగా యాత్రలు., ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురష్కరించుకొని యువతలో దేశభక్తిని పెంపొందేలా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో సమరయోధులు ఎంతో కృషిచేశారన్నారు. ఎన్నో త్యాగాలను చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాలను, కృషిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ చర్చిసెంటర్ నుంచి రిమ్స్ వరకు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉషారాణి, లోకేశ్వరరావు, రవికుమార్‌తోపాటు పేస్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సమస్యలపై వినతి

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : అద్దంకి ఆర్టీసీ డిపోలో పలు సమస్యలను పరిష్కారించాలని ఎన్ఎంయూఏ అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ ఏపీ బాబు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్‌లు స్పేర్‌లో ఉండి డ్యూటీ రాని సమయంలో 2గంటలపాటు వారిని డిపోలో స్పేర్‌లో కూర్చోబెట్టి బలవంతంగా సెలవు వేసి ఇంటికి పంపిస్తున్నారన్నారు. దీనివల్ల సెలవులన్నీ అయిపోయి అత్యవసర సమయంలో సెలవు పెడితే జీతం కట్ అయి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14 : భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవానికి రంగం సిద్ధమైంది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్‌డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి గురువారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తారు.